కథ

# ఏమో! చెప్పలేను

వావిలికొలను రాజ్యలక్ష్మి

**"నాయనమ్మా"**

**"ఊం..."**

**"నాన్న ఎక్కడికి వెళ్లాడు?"**

**"తెలియదు"**

**"నీకు తెలియదంటే నేను నమ్మను. నీకు చెప్పకుండా ఎక్కడికీ వెళ్లే అలవాటు నాన్నకు లేదుగా" సునీత ముసలావిడ వంక కోపంగా చూసింది.**

"వాడు ఎక్కడికి వెళ్లాడో నాకు తెలిసినా నీకు చెప్పాలని మాత్రం నాకు లేదు" ఊడిపోతున్న జుత్తును చేత్తో ముడేసుకుంటూ తాపీగా అందావిడ.

ఒళ్లు మండిపోయిందీమారు సునీతకు. "ఏం.. ఎందుకనీ? మీ తల్లీకొడుకులిద్దరూ కలిసి చేస్తున్న ఆ పెళ్లి అనే రహస్య మంతనాలు నాకు తెలుస్తాయనా?"

"ఎవరికి తెలిసినా నేను భయపడతాననుకుంటున్నావా? ఎవ్వరు అడ్డొచ్చినాసరే ఈ పెళ్లి మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ ఆగదు. ఈ భారతమ్మ అంటే ఏమనుకుంటున్నావేమో?" మనవరాలిని ధిక్కరించినట్లుగా చూస్తూ బెదిరింపుగా అంది.

"ఛ వూర్కో. నాకైతే వింటుంటేనే ఒళ్లంతా చాలా కంపరంగా వుందా పెళ్లి విషయం" విరక్తితో రోతగా అందీమారు సునీత.

"అంత కంపరంగా వున్నదానికి ఇక ఆ విషయాలు అడగడం, వినడం ఎందుకు?"

"మూడు నెలల క్రితమే పెద్దకూతురికి కొడుకు పుట్టి తాతయ్య అయి వుండి కూడా ఈ వయసులో మా నాన్న ఇప్పుడు రెండో పెళ్లి చేసుకుంటున్నాడని విన్న నా స్నేహితులు, తెలిసిన వాళ్లందరూ తెగ నవ్వుకుంటున్నారు నీకు తెలుసా నాయనమ్మా?"

"నవ్వనీ.. వాళ్ల పళ్లే బయట పడతాయి"

"నీ కొడుకుకు మళ్లీ పెళ్లి చేయాలన్న ఈ మాయదారి ఆలోచన వున్నదానివి- అప్పుడే, మా అమ్మ చనిపోయినప్పుడే మా అక్కాచెల్లెళ్లం ముగ్గురం పసివాళ్లుగా వున్నప్పుడే చేయలేకపోయావా? ఆ వయసులో ఐతే మాకు ఏం తెలిసివచ్చేది కాదుగా!" నాయనమ్మను కోపంతో మింగేసేలా చూస్తూ వెటకారంగా చెప్పింది సునీత.

"అదేనే.. నేనప్పుడే నెత్తీనోరూ బాదుకొని చెప్పాను వాడికి. సవతి తల్లి వస్తే ఎక్కడ మిమ్మల్ని బాధలు, కష్టాలు పెట్టేస్తుందోనన్న భయాందోళనలతో నా మాట ఖాతరు చేయక ససేమిరా అన్నాడు. మీ ముగ్గుర్ని మూడు ఆణిముత్యాలంటూ ఎంత గారాబంగా, అపురూపంగా పెంచాడో నాకు తెలుసే! నడక నేర్చుకునే వయసులో కాళ్లు క్రింద పెడ్తే మీ పాదాలు ఎక్కడ కందిపోతాయోనని తన అరచేతుల్లో పెట్టుకొని నడిపించాడే. అలాంటి దేవుడు లాంటి నా కొడుకును కన్నతండ్రి అని కూడా చూడకుండా ముగ్గురు కూతుర్లు శూలాల వంటి మాటలంటూ వాడి మెత్తని మనసును నొప్పిస్తూ ఇల్లో నరకం చేస్తున్నారిప్పుడు"

"తాతయ్య అయి ఈ వయసులో పెళ్లి చేసుకోవడం సంగీతక్కకుగాని, నీతక్కకుగాని, నాకుగాని ఎంతమాత్రం ఇష్టంలేదు. ఈ పెళ్లి జరగకూడదు" సునీతది ఖచ్చితమైన అభిప్రాయం.

"తాతయ్య అయి మీ నాన్న పెళ్లి చేసుకుంటున్నాడని అంటున్నావుగాని, మీ తాతయ్య చనిపోగానే వాడికి చిన్న వయసులోనే పెళ్లి చేశానే. మూడేళ్లు తిరిగేసరికల్లా మీ ముగ్గురు పుట్టుకొచ్చారు. నీ కాన్పులోనే మీ అమ్మ ఆరోగ్యం పూర్తిగా పాడై మిమ్మల్ని నా చేతిలో పెట్టి కన్నుమూసింది. మీ నాన్నకిప్పుడు నలభై రెండేళ్లు. మీరు వాడికి చెల్లెళ్లలా అనిపిస్తారుగాని, కూతుర్లుగా కనిపించరు. ఈ రోజుల్లో ముప్పై ఆరేళ్లు వచ్చినా పెళ్లి కానివాళ్లు వున్నారు తెలుసా? మీ పెద్దక్క సంగీత పెళ్లి నా తమ్ముడు మరదలు పీటల మీద కూర్చొని కన్యాదానం చేశారు. పోయిన సంవత్సరం పెళ్లి అయిన మీ చిన్నక్క సీతకు మీ అక్కాబావ కూర్చొని చేశారు. చిన్నదానివైన నీ పెళ్లి అయినా తన చేతుల మీదుగా చేయాలని వాడి కోరిక. ఎప్పటి నుండో నా కోరిక ఏమిటో తెలుసా? వాడో ఇంటివాడు కావాలని. నీవేమో మీ పెద్దబావ తమ్ముడిని చేసుకుంటానని మనసు పడితే, నిన్ను ఒక్కమాటన్నా అన్నాడా? లేదే- నేను మాత్రం వద్దన్నాను. ఎందుకంటే ఒకే ఇంటికి ఇద్దరాడపిల్లల్ని ఇస్తే బాగుండదురా! స్వంత అక్క చెల్లెళ్లే తోడికోడళ్లు అయితే వాళ్ల మధ్య లేనిపోని మనస్పర్థలు వస్తాయని చెప్పాను. కానీ వాడు నా మాట వినలేదు. వద్దంటే తన చిన్నకూతురు ఎక్కడ మనసు బాధ పెట్టుకుంటుందోనని వెళ్లి వియ్యంకులతో మాట్లాడి నీ పెళ్లి సెటిల్ చేసుకొని వచ్చాడు గదా! వాడు ముందు ఓ ఇంటివాడై, తానే స్వయంగా నీ పెళ్లి చేస్తాడు" భారతమ్మ ఏకధాటిగా మాట్లాడి వూపిరి పీల్చుకుంది.

"ఉహుం... అలా నాకొద్దు నాయనమ్మా! ఎవత్తినో పెళ్లి చేసుకొని దాన్ని పక్కన కూర్చోబెట్టుకుని నా పెళ్లి చేస్తే ఆవిడ నా అమ్మ అవుతుందా ఏమిటి? నేనలా ఛస్తే చేసుకోను. నేను రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటాను."

"కాబోయే పిన్నిని పట్టుకొని అది, గిది అని అసభ్యంగా మాట్లాడకే నీతా! ఆదిలక్ష్మి ఎవరో పరాయిది కాదే! నా మేనమామ దిక్కు దగ్గరి చుట్టరికం వుంది. అందరూ నవ్వడానికి, వెక్కిరించడానికి నీ అంత వయసున్న పదహారేళ్ల పడుచు భామామణిని పెళ్లి చేసుకోవడం లేదు మీ నాన్న. ముప్పై పైనే వుంటాయి ఏళ్లు ఆదిలక్ష్మికి. భర్త చిన్నప్పుడే పోయిన విధవరాలు. ఓ ముసలి తల్లి తప్ప ఎవరూ దిక్కులేని ఓ అనాథ స్త్రీని పెళ్లి చేసుకుని ఆశ్రయమిచ్చి దానికో నీడ కల్పిస్తున్నాడు. నా కొడుకు పెళ్లికి మీరెవ్వరూ వచ్చినా రాకపోయినా నేను దగ్గరుండి జరిపిస్తాను తెలుసా?" ఏం చేసుకుంటావో చేసుకో అన్నంత ధీమాగా పలికింది భారతమ్మ.

"సంబరంగా కొడుకు పెళ్లి చేసుకో, చేసుకో! ఆ వచ్చే కొత్తకోడలు పెట్టే ఆరళ్లు నీకీ వయసులో అనుభవించాలని రాసి వుంది. ఏం చేస్తాం? నీ ఖర్మ!"

"నీవేం నన్ను అలా వెక్కిరించనక్కరలేదే! నేనెన్ని కష్టాలు, బాధలు అయినాసరే నా కొడుకు సంతోషం కోసం భరించడానికి సిద్ధంగా వున్నాను.

"ఛ! నాకస్సలు ఇక్కడ వుండాలని కూడా మనస్కరించడంలేదు. నేనిప్పుడే సంగీతక్క దగ్గరికి వెళ్లిపోతాను" ఛీత్కారంగా అంటూ గదిలోకెళ్లి గబగబా బ్యాగ్ సర్దుకోసాగింది సునీత.

* * *

అప్పుడే వాకిట్లో స్కూటర్ దిగాడు మాధవరావు.

భుజాన బ్యాగ్ వేసుకొని వినవిసా నడిచి వెళుతున్న కూతుర్ని ఆశ్చర్యంగా చూస్తూ "ఎక్కడికెళుతున్నావు నీతా?" ప్రేమగా అడిగాడు.

"ఎక్కడికో మీకెందుకు? ఏట్లోకి" విసురుగా అంటూ సునీత వెళ్లిపోయింది.

కూతురు వెళుతున్న వైపే అయోమయంగా చూస్తూ ఇంట్లోకి వచ్చాడు మాధవరావు.

"నీవు వెళ్లిన పని ఏమైందిరా మాధవ్?" భారతమ్మ నవ్వుతూ కొడుకుకు ఎదురొచ్చింది.

"నీతా... ఏంటే అమ్మా, అడిగినా చెప్పకుండా వెళుతుంది ఎక్కడికమ్మా?"

"నీ ముద్దుల మూడవ కూతురికి చాలా తల బిరుసుతనంరా! దానికి బాగా పొగరెక్కింది. ఏంటేంటో మాట్లాడుతుంది. నీవు దాని పెళ్లి చేయడానికి వీల్లేదట. తాను

రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటుందట. వాళ్ల పెద్దక్క దగ్గరికి పూరెళ్లింది."

"నీ మాట కాదనలేక ఒప్పుకున్నానుగాని, సీత పెళ్లి నేను చేయలేకపోయినప్పుడు ఇక నాకెందుకమ్మా ఈ పెళ్లి" దీనంగా చూస్తూ బేలగా ప్రశ్నించాడు తల్లిని.

"ఒరేయ్ మాధవ్! ఇన్నాళ్లూ నీ ముగ్గురు కూతుర్లు మనసున్న పసిడి బొమ్మలనుకొని మురిసిపోయావ్ కాని, ఇప్పుడు చూడు ఏమైందో? నీ పెళ్లి మాట వినగానే అస హ్యించుకుంటున్నారు. నీ బిడ్డలకి నిజంగా నీమీద ప్రేమ లేదురా! నీ వెనకాల వున్న ఆస్తి మీద ప్రేమ వుందంతే. ఆ పెద్దదానికైతే మరీను. టీవీ సీరియల్స్‌లోని ఆడ విలనే అనుకో. పెళ్లి అయినప్పటి నుంచి దాని స్వభావం అలా మారిపోయింది. డబ్బు, నగలు తప్పించి మరో మాటే రాదు దాని నోట్లో నుంచి. నీవేం వాళ్ల సూటి పోటి మాటల్ని పట్టించుకోకు మాధవ్! ముసలిదాన్ని అయిపోయాను. నేను పోయాక నీ ఆలనా పాలనా ఎవరు చూస్తారురా? నీ ఈ కూతుళ్లు వచ్చి చూసుకుంటారని అనుకుంటున్నావా? ఊహుఁ... లాభం లేదు. వాళ్లు నీవైపే నమ్మి చూడరు. ఈ వయసులో నీకంటూ ఓ తోడు వుండాలిరా! ఇంతవరకూ వచ్చాక ఇక వెనక్కి తగ్గేదే లేదు, ఎవరు ఏమనుకున్నాసరే. ఇంతకీ పురోహితుడు పెళ్లి ముహూర్తం ఎప్పుడు పెట్టాడు?"

"వచ్చే శుక్రవారం దశమి, ఉదయం పది గంటలకి రామాల యంలో.." నిర్లిప్తంగా అంటూ వాలుకుర్చీలో చతికిలపడ్డాడు మాధవరావు. రెండు చేతులూ తల క్రింద పెట్టుకొని తన కూతుళ్లను గురించే తీవ్రంగా ఆలోచించసా గాడు. తల్లి భోజనానికి రమ్మని పిలి చినా కూడా వినిపించుకొనే స్థితిలో లేడు.

* * *


తండ్రి పెళ్లి విషయం చర్చించ డానికి భర్తలకు తెలియకుండా ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఓ పార్కులో రహస్యంగా సమావే శమయ్యారు.

"ఉన్న ఆస్తిని మన ముగ్గురుకీ సమానంగా పంచి ఇవ్వమని నాన్నకు నేను ఫోన్ చేసి చెబుదామనుకుంటు న్నాను సీతా! మరి నువ్వేమంటావ్?" ముందుగా సంగీత మాటలకు ఉపక్రమిస్తూ అంది.

"అయ్యో, అదేమిటి? ఇప్పుడు ఆస్తి పంపకాలెం దుకు? మనకేం తక్కువైంది? అదంతా నాన్నకు, నాయన మ్మకే వుండనీ గీతక్కా" సీత కంగారుగా అంది.

సీత మొదటి నుంచి మెతక స్వభావం గలది. తండ్రి అంటే కాస్త ఎక్కువ అభిమానమే. తాను అచ్చు తల్లి పోలి కలను పుణికిపుచ్చుకొని పుట్టిందని తనను ఎక్కువ ముద్దుచేసేవాడు తండ్రి.

"మీ అత్తగారింట్లో ఏమీ అనడంలేదా? మా ఇంట్లో అయితే రోజూ ఇదే భాగోతం అనుకో. వినలేక చస్తు న్నాను. అందరూ నన్ను



తలో దిక్కున దెప్పుతున్నారు. 'మీ నాన్నకి మతిగాని పోయిందా? మనవడు పుట్టాక, ముసలాడికి ఇప్పుడు మళ్లీ పెళ్లి కావాల్సి వచ్చిందా?' అంటున్నారు. ఛీ! తల్చు కుంటేనే నాకు చాలా కంపరంగా వుంది" సంగీత తండ్రి పట్ల ఏహ్యభావంతో ఛీత్కారంగా అంది.

"మా అత్తగారూ వాళ్లేమో పైకి ఏమీ అనడంలేదు గానీ- లోలోపల ఏమనుకుంటున్నారో నాకైతే తెలియదు" సీత నిదానంగా ఆలోచిస్తున్నట్లుగా అంది.

"అస్సలు ఆ ముసలిదానికి అదే, మన నాయన మ్మకు సిగ్గులేదు. కొడుకుకు మళ్లీ పెళ్లి చేయడానికి తెగ సంబరపడిపోతుంది. ఎవరు అడ్డొచ్చినా ఈ పెళ్లి ఆగదట అక్కయ్యా, నాతో చెప్పింది ఖచ్చితంగా" సునీత కోపంగా అంది అక్కలతో.

సీత ఇక ఎక్కువగా ఏం మాట్లాడదల్చు కోలేదు. మౌనంగా వుండిపోయింది.

“అదెవత్తో ముక్కూముఖం తెలియని దాన్ని పెళ్లి చేసుకుంటే మనకున్న ఆస్తి అంతా దానికి పుట్టబోయే పిల్లలకే దక్కు తుందే పిచ్చిమొద్దూ! కాబట్టి, ఆస్తి పంప కాలు తప్పనిసరిగా జరగవల్సిందే” చిన్న క్కను గద్దిస్తూ, పెద్దక్కకు వంతపాడుతూ సునీత ఖచ్చితంగా అంది.

“మీ ఇష్టం. నాకైతే ఏం తెలియదు. పెద్దదానివి నీకెలా బాగుంటే అలా చెయ్యి అక్కయ్యా” సీత వెళ్లడానికన్నట్టుగా లేచి నిలబడింది.

“బాబును మా అత్తగారి దగ్గర వదిలేసి వచ్చాను. నేను కూడా వెళ్లాలి. పదవే నీతా!” సంగీత కూడా లేచి వెళ్ల డానికి ఉద్యుక్తురాలైంది.

* * *

తన పెళ్లి ముందుగానే మాధవరావు లాయర్‌ను సంప్రదించి, ఒక ఐదెకరాల మాగాణీ వున్న ఇల్లు తానుం చుకొని, మిగిలిన ఆస్తినంతా ముగ్గురు కూతుర్ల పేరునా సమానంగా రాసి రిజిస్టర్ చేయించి, వాళ్లకా ఆస్తి కాగితా లను పంపుతూ పెళ్లికి రమ్మని ఆహ్వానిస్తూ ముగ్గురు కూతుర్లకీ విడివిడిగా ఉత్తరాలు రాశాడు.

పెద్దకూతురు సంగీత ఆస్తి కాగితాలను అబ్బురంగా చూసుకొని మురిసిపోతూ, తండ్రి రాసిన ఉత్తరాన్ని మాత్రం కోపంగా చించి పోగులు పెట్టింది. చిన్నకూతురు సునీత కూడా అక్క పట్టించిన గతే తండ్రి రాసిన ఉత్తరా నికి పట్టించింది.

రెండో కూతురు సీత మాత్రం ఆ కవర్ని జాగ్రత్తగా దాచుకొని, తండ్రి రాసిన ఉత్తరాన్ని మాత్రం పదే పదే చదువుకుంది.

అనుకున్న ప్రకారం కొడుకు పెళ్లి గుళ్లో క్లుప్తంగా జరి పించింది భారతమ్మ. తన తల్లి కోర్కెకైతే తీరిందిగాని, కూతుర్లు ఎవ్వరూ రానందుకు మాధవరావు మాత్రం ఎనలేని బాధకు లోనయ్యాడు.


అంతట్లోనే గుడి ముందుకో కారు సర్రున దూసుకు వచ్చి ఆగింది.

డ్రైవర్‌తో ఏదో మాట్లాడుతూ కారు దిగిన సీత మెల్లగా గుళ్లోకి వచ్చింది.

కొత్త పట్టుబట్టల్లో, మెళ్లో నిండుగా వున్న గులాబీ పూలదండలతో కళకళలాడు తున్న ఆ జంటని కన్నార్పకుండా చూసిందో క్షణం.

కన్నకూతుర్ని చూడగానే మాధవరావు ముఖం సంతోషంతో దేదీప్యమానంగా వెలి గిపోయింది క్షణంలో. భారతమ్మ మనవ రాలి రాకకు ఎంతో ఆనందపడింది.

“నాన్నా...” అంటూ వచ్చి సీత తండ్రిని వాటేసుకుంది.




“గీత, నీత రాలేదామ్మా?” కళ్లల్లో దిగులు కదలాడగా నిరాశగా అడిగాడు.

“వాళ్ల సంగతి నాకు తెలియదు నాన్నా” అంటూ పక్కనున్న పిన్ని వైపు పరీక్షగా చూసింది సీత. ఆదిలక్ష్మి అంత అందగత్తె కాకపోయినా చామన ఛాయతో, పెద్ద పెద్ద సోగకళ్లతో, గుండ్రటి ముఖంతో, నుదుట ఎర్రని కుంకుమ బొట్టుతో, మెడలో కొత్త పసుపుతాడుతో కళకళ లాడుతోంది. వాళ్లిద్దరి జంట వయసుకు తగ్గట్టుగా ఈడు జోడు చాలా బాగా కుదిరింది.


ఆదిలక్ష్మిని అలాగే అలవోకగా చూస్తూ చిన్నగా పలక రింపుగా నవ్వింది సీత.

భారతమ్మ ముందుకు వచ్చి మనవరాలిని కోడలికి పరిచయం చేసింది.

సీత నెమ్మదిగా తన చేతికున్న ఉంగరం తీసి “పిన్నీ! ఇది మా అమ్మ ఉంగరం. నా పెళ్లిలో నాన్న నాకిచ్చాడు. దీన్నిప్పుడు నేను మీకిస్తున్నాను” అంటూ ఆదిలక్ష్మి చెయ్యి ఆప్యాయంగా పట్టుకొని సుతారంగా మధ్యవేలికి తొడిగింది.

ఎంతో అపురూపంగా చూసిందా దృశ్యాన్ని భార తమ్మ. మనవరాలి బుగ్గల్ని పుణికిపుచ్చుకొని సంతోషాతిశ యంతో ముద్దాడింది.

“పిన్నీ! నాయనమ్మ, నాన్న మాకు పసితనం నుంచి అడగకుండానే ఎన్నో చేశారు. కోరిందల్లా ఇచ్చారు. కాని మేమే వాళ్లకీ వయసులో ఏం ఇవ్వలేకపోయాము. చివరి కిలా వాళ్ల మనసుల్లో బాధను, దుఃఖాన్ని మాత్రమే మిగి ల్చాము. మీరే ఇక వీళ్లిద్దర్ని జాగ్రత్తగా చూసుకోవాలి” నీళ్లు నిండిన కళ్లతో చూస్తూ గద్గదిక స్వరంతో అంటూ సీత నాయనమ్మ చేతిని, తండ్రి చేతిని ప్రేమగా అందుకొని ఆదిలక్ష్మి చేతిలో పెట్టింది.




ఆదిలక్ష్మి ఆ చేతులపై తన చెయ్యి వేసి, గట్టిగా అలాగే అదిమిపట్టి “తప్పకుండా సీతా! మోడైన నా జీవితంలో ఈ వెన్నెల వెలుగును నింపిన ఈ సహృదయుల్ని నా ప్రాణం కన్నా మిన్నగా ప్రేమానురాగాలతో చూసుకుంటానని మాటిస్తున్నాను నీకు. నన్ను నమ్ము” కల్మషం లేని స్వచ్ఛమైన నిండుమనసుతో నవ్వుతూ అంది.

సీత తన భుజానికున్న హేండ్‌బ్యాగ్‌లో నుంచి ఓ కవరు తీసి “నాన్నా! మీరు పంపిన ఆస్తి కాగితాలు. మా అత్తగారికే బోలెడంత ఆస్తి వుంది. మళ్లీ ఇంకా ఇదెం దుకు? నాకొద్దు నాన్నా! పుట్టబోయే తమ్ముడికి ఓ అక్క ప్రేమకానుకగా ఇది ఇవ్వండి” అంటూ చిన్నగా నవ్వుతూ తండ్రి దోసిట్లో పెట్టిందా కవర్ని.

“నా తల్లే నా తల్లే... మీ అమ్మలాగా నీదెంత దొడ్డమ నసే సీతా! నీకున్న మంచి బుద్ధులు పెద్దదానికి కాస్త అయినా వచ్చివుంటే బాగుండును” భారతమ్మ మనవరా లిని ప్రేమగా అక్కున చేర్చుకుంది.

కవరుకేసి, కూతురు ముఖం కేసి మార్చి మార్చి చూస్తూ “నిజం చెప్పమ్మా! నేనీ పెళ్లి చేసుకొని తప్పు చేశానా సీతా?” చిన్నపిల్లాడిలా వేడుకోలుగా అడిగాడు మాధవరావు.

“ఏది తప్పో, ఏది ఒప్పో ఆలోచించే శక్తి నాకు లేదు నాన్నా! మీరు సంతోషంగా వుంటే చాలు. మరిక నేను వెళ్తాను నాయనమ్మా!”

“అప్పుడే వెళ్తావా? ఇంటికి రావా? భోజనం చేసి వెళ్లవా?”

“లేదు. వెంటనే వెళ్లాలి. నేనిక్కడికి వచ్చినట్టుగా మా ఇంట్లో ఎవరికీ తెలియదు.”

“నాచేత పెళ్లి జరిపించుకోవడానికి సునీతకు నీవైనా సర్దిచెప్పి ఒప్పించు సీతా!” కూతుర్ని మరోమారు వేడుకో లుగా ప్రార్థించాడు మాధవరావు.

“సునీతను ఒప్పిస్తానని నేనైతే మీకు మాట ఇవ్వలేనుగాని, నా శాయశక్తులా తప్పకుండా ప్రయత్నిస్తాను నాన్నా! మరిక వుంటాను.”

ఆ ముగ్గురూ- వెళుతున్న సీత వైపే చూస్తున్నారు.

కార్లో కూర్చుని ఇటే చూస్తూ చెయ్యి ఊపుతున్న సీత రూపం... సజల నయనా లతో చూస్తున్న మాధవరావుకు మసక మసగ్గా కనిపించింది.